# జడ

నెలరోజుల నుంచి ఇంట్లో ఇదే పోరు. అమెరికా సంబంధం వద్దంటే ఎలా 'ఎందరో దీనికోసం ఎగబడుతున్నారు. నీ స్నేహితులెంతమంది అక్కడ లేరూ' అరుస్తోంది జానకమ్మ, పడక్కుర్చీలో పడుకుని పేపరు చదువుతున్న నీరజని చూస్తూ. నీరజ తల్లిగొంతు వినిపించనట్లే, పేపరులో ముఖం మరీ దగ్గరగా పెట్టి శ్రద్ధగా చూస్తోంది. కాసేపయ్యాక పేపరు పక్కనపడేసి కిటికీలోంచి వీధిని చూస్తూ నిలబడింది. మొన్న మావయ్య వచ్చి అమ్మతో గట్టిగా తనకి వినబడేలా అన్న మాటలు మళ్లీ గుర్తొచ్చాయి. 'ఎవడినైనా ప్రేమించిందేమో కనుక్కోండి, ఏమిటీ గొడవ' ఏమో, ఇంతకీ ఇదంతా మా కర్మ అంది నెత్తికొట్టుకుంటూ జానకమ్మ.

తను ఎవర్నీ ప్రేమించలేదని చెప్తే వినరు. నమ్మరు అమెరికా సంబంధం చేసుకొనడంలేదు. ఈ సంబంధం చేసుకోనూ అంటే అర్థం చేసుకోరు - పోనీ, ఎందుకు ఈ సంబంధం చేసుకోనంటోందో చెప్పేస్తే నమ్ముతారా!! నీరజకి ఎందుకో ఒక్కసారి నవ్వొచ్చింది. ఏమిటా నవ్వు - తల్లి గుమ్మంలోనే వుంది. నీరజ మాట్లాడలేదు. నెలరోజులు దాటిపోయాయి. మామయ్య వచ్చి అమ్మతో గుసగుసలు చెప్తున్నాడు. కాకపోతే పదేళ్ళు తేడా అంది కొంచెం విచారంగా జానకమ్మ.

'అయితే ఏమయింది. ఇది కూడా మీరు ఆలోచిస్తూ కూచుంటే, వారంరోజులలో ఏదో ఒకటి కుదుర్చుకు అబ్బాయి పెళ్ళిచేసుకువెళ్ళిపోతాడు నీ యిష్టం' మామయ్య లేచాడు. 'వుండు దాన్నడిగి అంది జానకమ్మ నెమ్మదిగా అది దీనిలా మొండిది కాదు. పైగా పిల్ల బావుందని ఆ పిల్లాడి తల్లి నాతో అంది. అది కాదనదుగా మామయ్య వెళ్ళిపోయాక అమ్మ చాలాసేపు ఏదో ఆలోచనలో వుండడం నీరజ గమనిస్తూనే వుంది. బిఎ పరీక్షలయిపోయిన చెల్లెలు, అమ్మ రహస్యంగా మాట్లాడుకోటం, మామయ్య రాకపోకలూ చూస్తూనే వున్న నీరజకి విషయం అర్థమవటానికి ఎక్కువసేపు పట్టలేదు.

పదిహేను రోజులు తిరిగేసరికి నీరజ చెల్లెలు పద్మజ పెళ్ళి అయిపోవడం, భర్తతో అమెరికా వెళ్ళిపోవడం జరిగిపోయింది.

నీరజ ఆఫీసు నుంచి వచ్చి, బాగ్ బల్లమీద పెట్టింది. ఏరోగ్రామ్ జానకమ్మ చదివి బల్లమీద పెట్టింది. ఎదురుగా కనిపించింది చిన్న చిన్ని అక్షరాలతో ఎన్నెన్నో

విశేషాలు రాసింది పద్మజ. 'ఎన్నెన్ని రకాల ఐస్‌క్రీములో అవి తింటుంటే నువ్వే గుర్తొచ్చావు. నువ్వు నేను కలసి హిమాయత్‌నగర్‌లో వున్న ఆ పెద్ద ఐస్‌క్రీమ్ షాపుకి ఎన్నోసార్లు వెళ్ళేవాళ్ళం కదూ. అక్కా, నీకు తెలుసుగా ఐ హేట్ పీజాస్ కానీ అతనికి అవే యిష్టం. అందుకే పీజాస్ తినడం అలవాటు చేసుకున్నానే. ఐలైక్‌దెమ్-ఆ ఉత్తరం గబగబ చదివేసింది నీరజ. అతని అలవాట్లన్నీ నువ్వు ఇష్టంగా చేసేసుకో, మరినీ అలవాట్లో! నీరజ తనలో తనే అనుకుంటూ ఆ ఉత్తరం బల్లమీద పడేసింది.

'అది హాయిగా లేదా' అంది తల్లి కాఫీకప్పు బల్లమీద పెట్టి ఉత్తరం మళ్ళా ఓమాటు చదువుతూ 'ఎవరి హాయి వాళ్ళదిలే' అంది నీరజ తన పొడువాటి జడ ముందుకు వేసుకుంటూ ఈ సంబంధం తనెందుకు వద్దందీ! నీరజ ఆ జడను చేత్తో పట్టుకుని బుగ్గలకి రాసుకుంటూ, కిటికీలోంచి వీధిలోకి చూస్తూంది. ఆ రోజు, 'ఇంట్లో పెళ్ళిచూపులు ఆ అబ్బాయికి ఇష్టంలేదట' మామయ్య హడావిడిగా వచ్చి జానకమ్మతో అన్నాడు. 'అదేమిటీ' అంది విస్తుపోతూ జానకమ్మ. 'అంతేలే రోజులు మారిపోయాయి. వాళ్ళకి ఏదిష్టమంటే మనం అదే అనాలి' అన్నాడు నీరజ వంక చూస్తూ. 'సరేనా' అన్నాడు మామయ్య నీరజతో నవ్వుతూ. 'సరే' అంది నీరజ బుగ్గలు ఎర్రపడుతుంటే. ఇంజనీర్, ఇల్లు, కారు వున్నాయి. కట్నాలలో, కానుకల్లో నమ్మకంలేదు. మామయ్య మాటలు తలచుకుంటూ అతనికేసి చూసింది నీరజ. అవును, నిజంగానే మంచి పిల్లలాగే కనిపిస్తోంది. కంప్యూటర్ ఇంజనీరు. తనకు కావలసింది అదే - మంచి కుటుంబం, బుద్ధిమంతురాలు-అమ్మ చెప్పిన మాటలు తలచుకుంటూ అమ్మాయి కేసి చూసాడతను. 'కారు డ్రైవ్ చేయడం వచ్చా' నీరజ కళ్ళలోకి చూస్తూ అన్నాడు. 'ఏడాదిగా బాగా డ్రైవ్ చేస్తున్నాను. ఆఫీసుకి కార్లోనే వెడతాను' నీరజ పొడుగాటి జడ ముందు కేసుకుంది. ముందున్న గాజు కప్పులో సూప్ చెంచాతో కదుపుతోంది.

'ఇంకేమి వచ్చా' అతను చిలిపిగా నవ్వుతూ అన్నడు. 'వంట చేయడం వచ్చు. చాలా బాగా చేస్తాను'. జడని చేత్తో పట్టుకు, బుగ్గలకి రాసుకుంటూ అంది నీరజ. అతను ఫక్కున నవ్వాడు. 'ఇక్కడలా అక్కడ ఆడవాళ్ళు వంటింట్లో ఎక్కువసేపు వుండక్కర్లేదు - అసలు వంటరాకపోయినా ఫరవాలేదు. అన్నీ రెడీమేడ్' అన్నాడు నీరజ ముందుకేసుకున్న పెద్ద జడవైపు చూస్తూ. తను కూడా ఇతన్ని ఏమైనా అడిగితే బాగుండును కదా అనుకుంటూ అతనికేసి చూసింది. అతని నిగనిగలాడుతున్న చెక్కిళ్ళు ఎంతో అందంగా కనిపించాయి. అతను నవ్వుతుంటే

చిన్నగా పడుతున్న డింపుల్స్ మరీ బాగున్నాయి.

నీరజ వెంటనే తల వంచుకుని సిగ్గుపడింది. అయినా ఏమడగాలీ - మా తాతయ్య మా అమ్మమ్మని ఏమడిగాడూ! అమ్మమ్మ తాతయ్యని ఏమడిగిందీ - వాళ్ళ నాన్న, వీళ్ళనాన్న మాట్లాడుకుంటే వీళ్ళు పెళ్ళిచేసుకుని హాయిగా ఎన్నో ఏళ్ళు జీవించేసారు. - నీరజకి అది అర్థంలేని ఆలోచనగా అనిపించి నవ్వొచ్చింది. నోటికి చెయ్యి కూడా అడ్డం పెట్టుకుంది.

ఇద్దరూ బయటకు రాగానే కారు దగ్గర అన్నయ్య, మావయ్య కనిపించారు. సంబంధం కుదిరిపోయిందనే అనుకున్నారు రెండు కుటుంబాల వాళ్ళూ. రెండు రోజులయ్యాక మావయ్య హడావిడిగా వచ్చాడు! అబ్బాయి అమ్మాయితో మళ్ళీ ఓసారి మాట్లాడుతాడట' అన్నాడు.

'సరే ఎక్కడా అంది జానకమ్మ, ఇంట్లో మేడమీద గదిలో కూర్చున్నారిద్దరూ. నీరజ జడలో సన్నజాజులు దండ పెద్దది పెట్టుకుంది. ఆ పొడుగైనా జడ ముందుకేసుకుని, జడ చివరలు వేలికి చుట్టుకుంటోంది. అబ్బాయి కాసేపాగి మైకల్ జాక్సన్ గురించి, పాడుతా తీయగా పాటల గురించి, కాసేపు మాట్లాడాడు. నీరజ మైకల్‌జాక్సన్ మ్యూజిక్ చాలా ఇష్టం తనకి అంది. నీరజ లోపలకెళ్ళింది. నడుము క్రిందవరకూ వేలాడుతూ, నల్లగా నిగనిగలాడుతూ వయ్యారంగా జడ కదులుతోంది నడుస్తుంటే. ఫ్రిజ్‌లోంచి కూల్‌డ్రింక్స్ తెచ్చి బల్లమీదుంచింది. మళ్ళా లోపలికెళ్ళింది ఆ పొడుగైన జడ ఈమారు మరీ వయ్యారాలు పోయింది. అతని ఆలోచనలన్నీ ఆ జడమీదకి మళ్ళాయి.

'అంత పెద్ద జడేమిటి, ఛీ' అనుకున్నాడు మనసులో. భుజాలవరకు కత్తిరించుకోమని చెప్పాలి అనుకుంటూ నీరజవైపు చూసాడు. నీరజ ఏదో ఆలోచిస్తూ జడలో వున్న పూలచెండు తీసి మళ్లా పెట్టుకుంది. జడ చివరలు ఒకసారి విప్పి మళ్ళా అల్లుకుంది. ఆ జడంటే మీకు మహా ఇష్టం అనుకుంటాను' అన్నాడతను. నీరజ కళ్ళు ఆనందంతో మెరిసాయి. ఇంత వరకు ఆ జడ గురించి మాట్లాడడంలేదేమో అనుకుంటోంది. తన జడని మెచ్చుకోనివారుండరు. ఇతనకీ ఈ జడ నచ్చిందన్న మాట.

'అవును. చాలా ఇష్టం. దీన్ని ఎంతో శ్రద్ధగా పోషణ చేస్తున్నాను. నా గర్వం అంతా ఈ జడే' అంది. ఆ జడని చేత్తో పట్టుకుని బుగ్గలకు రాసుకుంటూ చాలా సంతోషంగా.

అతను ముఖం చిట్లించాడు.

'ఐ హేట్ ఇట్' అప్రయత్నంగా అనేసి నాలుక కరుచుకున్నాడు. క్షణం విస్తుపోయింది నీరజ. మళ్ళా అతనే అన్నాడు. 'మీరు జీన్స్ వేసుకుంటారా' అని

'ఆ నా దగ్గర బ్లాక్, బ్లూ గ్రే కలర్స్ వున్నాయి' అంది ముభావంగా.

అతను కొంచెం ఆశ్చర్యంగా 'నిజంగా' అన్నాడు. సంభాషణ ఇద్దరికీ పెద్ద ఉత్సాహంగా లేదు. కానీ అతను ఆ విషయం చెప్పేయడమే మంచిదనుకున్నాడు. ఓ క్షణం ఆగి 'ఆ జడ భుజాల వరకు కత్తిరించుకుంటే చాలా బాగుంటుంది మీకు, పైగా అక్కడందరూ బాబ్‌కట్ చేసుకుంటారు" –

నీరజ క్షణం మాట్లాడలేదు. తన జడ కత్తిరించుకోవాలా! "ఐ హేట్ ఇట్ అంది వెంటనే. 'ఓ.కే' అంటూ భుజాలు ఎగరేసి ఆ అబ్బాయి లేచాడు.

ఆ తర్వాత అతను రెండుసార్లు ఫోన్ చేశాడు నీరజ మాట్లాడింది. 'ఏమంటాడూ' అంది జానకమ్మ నీరజతో

'ఏమీ అనడూ' అంది నీరజ

'అదేమిటీ' అంది తల్లి ఆవిడకి నీరసం వచ్చినట్లనిపించింది. కళ్ళు తిరుగుతున్నాయనిపించింది.

"అంటే – ఈ సంబంధం' నసిగింది జానకమ్మ 'చేసుకోను' –

జానకమ్మ నోట మాట రాలేదు. సంబంధం కుదిరిపోయిందనే అందరూ అనుకుంటుంటే ఇదేమిటీ!

చెల్లెలు పెళ్ళయి అమెరికా వెళ్ళిపోయాక, అమెరికాలో వుండే నీరజ ప్రాణస్నేహితురాలు ప్రశాంతి వచ్చింది నీరజ కోసం. నీరజ జడ ముందుకు వేసుకుని గలగలా నవ్వుతూ ఆ పెళ్ళికి సంబంధించిన విశేషాలు చెప్పింది.

'నీరజా నువ్వు ఫూల్‌వి... ఇంత చిన్న కారణం కోసం అంత పెద్ద సంబంధం వదులుకుంటారా ఎవరైనా' అంది కొంచెం కోపంగా ప్రశాంతి.

"అయినా నిన్ను పెళ్ళి చేసుకునేవాడి కోరిక తీరిస్తే తప్పా" అంది మళ్ళీ ప్రశాంతి. నీరజ మాట్లాడలేదు చాలాసేపు.

'ఇటు విను, ఇవాళ పొడుగు జడ బాగాలేదు కత్తిరించేయి అంటాడు. రేపు చీర కట్టుకుంటే ఏం బాగుండదు గౌను వేసుకో అంటాడు. ఎల్లుండి ఉద్యోగం మానేయ్, అంటాడు – ఇలా' నీరజ ఏదో చెప్తోంది ఆవేశంగా.

"అంటే అతని ఇష్టాలే నెరవేర్చాలనే తత్వం కనిపించిందతనిలో" నీరజ మాటలకి గొల్లున నవ్వింది ప్రశాంతి. ఒక గంటలో ఒక వ్యక్తి గురించి తెలిసిపోయిందా నీకు– ఒక జీవిత కాలమైనా చాలదు ఒక వ్యక్తిని ఒక వ్యక్తి అర్థం చేసుకోవడానికి– ఎన్నయినా చెప్పు, నువ్వు చేసిన పనిలో అర్థంలేదు అంతే" అంది

ప్రశాంతి.

'జీవితమంతా అన్నిటా ఇంటర్‌ఫియర్ అవుతాడని భయమేసీ' నీరజ ఎటో చూస్తోంది. 'అలా అయితే ఎవరూ నీకు నచ్చరు' అంది ప్రశాంతి. 'ఉంటారులే నచ్చేవాళ్ళు'- అంది నవ్వి నీరజ. ఆ సంభాషణలు అక్కడితో ఆగిపోయింది.

ఏడాది గడిచింది. చికాగో వున్న పిన్ని కూతురు లలిత హైదరాబాద్‌లో పెద్ద నర్సింగ్‌హోమ్ నడుపుతోంది. పెద్ద డాక్టరుగా అప్పుడే లలిత మంచి పేరు సంపాదించింది. ఆ లలిత పెళ్ళని పిన్ని చికాగో నుంచి రావడంతో జానకమ్మ ఇల్లంతా సందడిగా వుంది. పెళ్ళికొడుకు డాక్టరే...మంచి సంబంధం కుదిరిందని అమ్మ, పిన్ని, లలిత సంతోషిస్తుంటే ఎంత మంచి సంబంధం' అని నవ్వుకుంది నీరజ. అలా నవ్వుతూ కాలం గడిపేస్తున్న నీరజని చూస్తే జానకమ్మకి చాలా బాధ, బెంగా. ఈ పిల్లకి పెళ్ళి చేయగలమా అనే పెద్ద బెంగ. ఆ బెంగతో ఈ మధ్య జానకమ్మ సుస్థీ పడింది కూడా.

డాక్టరు లలిత, భర్త హాయిగా వున్నారని ఈమధ్యనే రెండో నెల పూర్తయిందని అమ్మ చెపితే లలితను చూడాలని అనిపించింది నీరజకి. ఆరోజు శుక్రవారం. జానకమ్మ చాలా హడావుడిపుతోంది పూజ చేసుకోవాలని. అంతలో వీధిలో కారు హారన్ మోగింది. లలిత గబగబా లోపలకొచ్చింది. నీరజ లలిత వంక ఆశ్చర్యంగా చూస్తోంది. "ఏమిటీ అలా చూస్తున్నావ్- ఈ చిన్న సైజు అమ్మవారు ఎవరా అనా" అంటూ కుంకుమ భరిణ తీసి బొట్టు పెట్టి సాయంత్రం పేరంటానికి రావాలి అంది లలిత. లలిత వెళ్ళి జానకమ్మతో మాట్లాడుతుంటే రకరకాల ఆలోచనలలోంచి బయటకి రాలేక పోయింది నీరజ.

వంటింట్లోంచి బయటకొచ్చిన లలిత నీరజ వైపుకు చూస్తూ "అంతే ఆ చిన్నక్రాపు, ఆ సూది మొనబొట్టు, ఆ లిప్‌స్టిక్ పెదాలు, పాంటు, షర్టు అవన్నీ ఇంతకు ముందవతారం. ఇప్పుడు, ఇదిగో రెండు చేతుల నిండా గాజులు, ఈ జడలో కనకాంబరాలు, అమ్మవారంత బొట్టు- చూసావా- ఇవన్నీ ఎవరికోసం మరి- తప్పదు పెళ్ళయ్యాక- నువ్వయినా అంతే, రేపు ఎవరో వచ్చి ఆజడ కత్తిరించేయ్, బాయ్‌కట్ చేయించుకో అన్నాడనుకో, తప్పకుండా చేయించుకుంటావే-దిసీజ్ లైఫ్, బేబీ" అంది గలగలా నీరజ ఉలిక్కిపడింది. తెలిసి అంటోందా, ఉదాహరణంగా అంటోందా! ఏమన్నా కానీ, తను మాత్రం జడ

కత్తిరించదు! అంతే!

కాలం గబగబా పరుగెత్తింది. నీరజ చెల్లెలు పద్మజ భర్త అమెరికా ఉద్యోగం వదిలేసి ఢిల్లీలో కంపెనీలో చేరాడు. పద్మజ అందంగా, హుందాగా కనిపించింది. జడ వేసుకొని పూలు పెట్టుకొంది. నీరజ చెల్లెల్ని చూస్తూ అదేమిటే, మీ ఆయనకి జడ అంటేనే అసహ్యం కదా- అంది హేళనగా. "ఇప్పుడు జడ వేసుకుంటే బాగుంటావంటూ నన్ను తెగపొగడాడనుకో - అందుకే మెల్లగా మెల్లగా జుట్టు పెంచేసి చక్కగా జడ అల్లుకుంటున్నా అంది హాయిగా నవ్వుతూ పద్మజ. "అంటే అదేనండీ దాని కేదిష్టమో అదే నాకూ" ఇష్టం, నాకేదిష్టమో అదే దానికిష్టం-దటీజ్ లైఫ్" అన్నాడు. పద్మజ భర్త నీరజ వంక చూస్తూ, పొడుగైన జడ వయ్యారంగా కదులుతుంటే చకచకా లోపలికి వెళ్ళిపోయింది నీరజ.

లోకమంతా ఒకటైనట్టు, తనొక్కర్తే ఒకటయినట్టు అనిపించింది ఆ క్షణం నీరజకి. తనకి తోడు జడ!!- గలగలా నవ్వుకుంది నీరజ ఆఫీసు మెట్లు ఎక్కుతూ. ఆఫీసులోకెళ్ళిన అర గంటకి గబగబా వచ్చింది మేరీ, నీరజ దగ్గర పనిచేసే అసిస్టెంటు.

మేడమ్, ఓ కొత్త విశేషం. మీరు నాలుగు రోజులుగా లీవ్‌లో వున్నారు కదా-మనకి హెల్త్ డైరక్టర్ ఢిల్లీ నుంచి ఒకామె వచ్చారు మిసెస్ స్మిత. మేరీ ఏదో చెప్తోంది. 'స్నేహంగా వున్నట్టు కనిపించినా నిజంగానే బాస్‌యేనా' అంది నీరజ. 'ఒక విధంగా బాసే మేడమ్-ఓ కొత్తరూలు పెట్టింది- ఆఫీసుకి వచ్చేటప్పుడు అందరూ ఓవర్‌కోట్ లాటిది వేసుకోవాలట-అంటే ఒక విధంగా యూనిఫారమ్ లాటిది అనుకోండి' "ఊ ఇంకా"

'ఇప్పుడు చెప్పబోయేదే మీకు ఇబ్బంది కల్గిస్తుంది' అంది మేరీ మెల్లగా "అంటే"

"కొందరు జడలు వేసుకుంటున్నాం-

కొందరు సిగలు చుట్టుకొంటున్నాం-

కొందరు జుట్టు అలా వదిలేస్తున్నారు-

అందుకని, అందరూ ముడి చుట్టుకోవాలంటూ, లేకపోతే చిన్నగా చెవుల దాకా జుట్టు వుంచుకోవాలట"

'ఏమిటీ-పిచ్చా ఏమన్నా- 'నేను చచ్చినా జడ కత్తిరించను-ఉద్యోగం పోయినా సరే" గట్టిగా నీరజ అరుస్తుంటే భయపడిపోయింది మేరీ

'అంత డిస్టబుతారేమిటి మేడమ్-ఈమె ఎన్నాళ్ళుంటుంది... మహా అయితే మూడేళ్ళు అందుకని ఉద్యోగం పోగొట్టుకుంటామా-అయినా మేడమ్, మీరేమి అనుకోవద్దు. మీరు కూడా నాలా బాబ్‌కట్ చేయించుకోండి బాగుంటారు-లేకపోతే

సిగ చుట్టుకోండి"-భయంగా అంది మేరీ

"సిగా-ఛీ". నీరజ సీసా లోనుంచి గబగబా మంచినీళ్ళు తాగింది.

కొత్తగా వచ్చిన డైరక్టర్ చాలా స్ట్రిక్ట్ అని చాలా అధికారం చెలాయిస్తుందని, మాట వినకపోతే మరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేయిస్తుందని రకరకాలుగా చెప్పుకుంటుంటే వింటోంది నీరజ. వారం రోజులయే సరికి ఆఫీసులో చాలా మార్పులు వచ్చేసాయి. ఆ సాయంత్రం మేరీ బతిమాలుతోంది నీరజని ' ఈ చిన్న దానికోసం పెద్ద ఉద్యోగం వదలుకుంటారా మేడమ్-రాజీనామా ఆలోచన మానెయ్యండి' మేరీ నీరజ ఆత్మీయురాలు. మంచి స్నేహితురాలు. నీరజ మేరీ మాటలు విని పకపకా నవ్వింది. 'నిజమే-పోగొట్టుకోను' అంది గట్టిగా ఈ జడ కోసం జీవితంలో ఒకసారి మంచి భాగస్వామిని పోగొట్టుకుంది. ఈ జడ కోసం ఉద్యోగం పోగొట్టుకుంటుందా!' తప్పదు, మేడం-రాజీ తప్పదు' నవ్వుతోంది మేరీ.

నీరజ చేతిలోకి పొడుగైన జడను తీసుకుంది. బుగ్గలకు రుద్దుకుంది. ఇంకో తప్పు చేయకూడదు అనుకుంటూ బ్యూటీపార్లర్‌లో అడుగుపెట్టింది. నీరజ-ఏది తప్పు ఏది ఒప్పు- ఓ మహాత్మా అనుకుంటూ పొడుగాటి జడ ముందుకు తీసుకుంది ఓ మాటు! భుజాల వరకు కత్తించిన జుట్టుతో, ఇంట్లో అడుగుపెడుతున్న నీరజని చూసి విస్తుపోయి చేతిలో వున్న కాఫీకప్పు కింద జారవిడిచింది తల్లి జానకమ్మ.

-వనితా జ్యోతి, డిసెంబరు '99